నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 మహబూబ్‌నగర్, బుధవారం 20 నవంబర్ 2024 MAHABUBNAGAR NARAYANPET





– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

# రైతన్న నిరీక్షణ

- ఓబులాయపల్లి సీసీఐ వద్ద బారులుదీరిన వాహనాలు
- సర్వర్ ప్రాబ్లంతో నిలిచిన పత్తి కొనుగోళ్లు
- ఆందోళనలో అన్నదాతలు

ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి అమ్మకానికి రైతన్నలకు గోస తప్పడం లేదు.. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ఓబులాయపల్లి వద్ద సీసీఐ ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రం ఎదుట కిలోమీటర్ల మేర తెల్లబంగారం లోడ్లతో ట్రాక్టర్లు, డీసీఎంలు బారులు దీరాయి. కేంద్రంలో సర్వర్ ప్రాబ్లం తలెత్తడంతో రోడ్డు పక్కన కాటన్ లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్లు వరుసగా నిలబడ్డాయి. ఒకవైపు మద్దతు ధర లేక.. మరోవైపు అమ్మడానికి కొనుగోలు కేంద్రాలు లేక పండించిన రైతన్నకు అవస్థలు తప్పడం లేదనడానికి ఈ క్యూ నిదర్శనంగా నిలుస్తోంది. కూలీలను పెట్టి పత్తిని ఏరి కొనుగోలు కేంద్రానికి తీసుకొస్తే రోజుల తరబడి నిరీక్షించాల్సి వస్తుండటంతో పలువురు వాపోతున్నారు. లోడ్ల వద్ద జాగరణ చేయాల్సిన పరిస్థితి అంటూ ఆవేదన చెందుతున్నారు. మా గోస అధికారులకు పట్టడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చొరవ చూపి పత్తి కొనుగోలు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. మంగళవారం కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు వాహనాల కిందే సేద తీరారు.



ఎస్ఎన్ఎస్ కంపెనీ విష రసాయనాలతో పచ్చగా మారిన వ్యవసాయ బావి

### ప్రజల ప్రాణాలతో చెలగాటం..



జింకలపల్లి జాతీయ రహదారిపై ఏర్పాటైన ఎస్ఎన్ఎస్ కంపెనీ ఐదు గ్రామాల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఆశ చూపించి మధ్యవర్తుల ద్వారా భూములు లాక్కొని ఇస్తామన్న ఉద్యోగాలు ఇవ్వకపోగా, మా జీవితాల్లో విషం చిమ్ముతున్నది. కంపెనీ నుంచి వచ్చే వ్యర్థాలతో నీళ్లు కలుషితమై అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. షేక్‌పల్లి పెద్దవాగు నుంచి కృష్ణానదిలోకి రసాయనాలు వెళ్తున్నాయి. ప్రభుత్వం స్పందించి కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.

**- భీమేశ్వర్‌రెడ్డి, షేక్‌పల్లి**

### భూములు పడావు పడ్డాయి..



కంపెనీ నుంచి భరించలేని దుర్గంధం వస్తున్నది. దట్టమైన పొగతో శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయి. కంపెనీ నుంచి వెలువడే వ్యర్థాలు ప్రాణాలకే ప్రమాదకరంగా మారాయి. తాగునీటికి, మూగ జీవాలకు ఆధారమైన వాగు కంపెనీ వల్ల విషపూరితంగా మారింది. కంపెనీ వ్యర్థాలు భూమిలోకి వెళ్లి పంటలు విషతుల్యమవుతున్నాయి. ధరలు లేక పడావు పడ్డాయి. ఇక్కడ పండించే కూరగాయలు, ఆకుకూరలు అమ్మితే ఎవరూ కొనడం లేదు. చుట్టుపక్కల భూములు బంగారంలా ధర పలుకుతుండగా, మా భూములకు విలువలేకుండా పోయింది. అధికారులు, ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

**- కాంతారెడ్డి, రైతు, షేక్‌పల్లి**

## పచ్చని పల్లెలపై

# కాలుష్యపు పడగ!

- తాగు, సాగునీరు కలుషితం
- సాగుకు నోచుకోని భూములు
- పెద్దవాగుతోపాటు కృష్ణానదిలోకి ఎస్ఎన్ఎస్ కంపెనీ వ్యర్థాలు
- ఐదు గ్రామాలవాసుల ఆందోళన
- పట్టించుకోని అధికారులు

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 19 : జింకలపల్లి జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎన్ఎస్ లిమిటెడ్ కంపెనీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నది. అలంపూర్ నియోజకవర్గంలోని షేక్‌పల్లి, ఎర్రవల్లి, కొండేరు, జింకలపల్లి, కోదండాపూర్‌తోపాటు సమీప గ్రామాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకున్నాయి. ప్రజల ప్రాణాలను హరించేలా.. సాగు భూములను జీవచ్ఛవంలా మార్చేలా ఎస్ఎన్ఎస్ కంపెనీ విషపూరిత రసాయనాలను వ్యాప్తి చేస్తున్నదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షేక్‌పల్లి పెద్దవాగుతోపాటు కృష్ణానదిలోకి విషరసాయనాలను వదులుతున్నారు. షేక్‌పల్లి పెద్దవాగు విషపూరితమై వాగు నీళ్లు తాగిన మూగజీవాలు మృత్యువాతపడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. కంపెనీ నుంచి వచ్చే దుర్గంధంతో శ్వాసకోస సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా వివిధ గ్రామాల ప్రజలు కంపెనీ నుంచి కలిగే నష్టాన్ని అధికారులకు చెప్పినా పెడచెవిన పెడుతున్నారు. కంపెనీ చుట్టుపక్కల గ్రామాల్లోని రైతుల నుంచి 50ఎకరాల వరకు భూమిని లీజుకు తీసుకొని అందులో కంపెనీ నుంచి వెలువడే విషపూరిత రసాయనాలను వదులుతున్నారు. దీంతో చుట్టుపక్కల పొలాలు సాగుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినా ఎలాంటి ప్రయోజనం లేదని, శాశ్వత పరిష్కారం చూపే వరకు ఆందోళనలు చేపడుతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.



### సమస్యలను తెలుసుకుంటాం..

కంపెనీ సమస్యలపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. గతంలో సమస్యలు వస్తే తగిన చర్యలు చేపట్టాం. కంపెనీ నుంచి ఎలాంటి విషరసాయనాలు వదలడం లేదు. 70ఎకరాల భూమిని రైతుల నుంచి లీజుకు తీసుకొని అందులో కంపెనీ నుంచి వచ్చే వేస్ట్‌వాటర్‌ను వదులుతున్నాం. రానున్న 6నెలల్లోగా అధికారులతో చర్చించి ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

**- శ్రీనివాస్‌రావు, జీఎం, ఎస్ఎన్ఎస్ కంపెనీ**



కంపెనీ నుంచి చెరువులోకి వచ్చిన రసాయనాలు

### ఫిర్యాదులేమీ రాలేదు..

ఎస్ఎన్ఎస్ కంపెనీ నుంచి సమస్యలపై ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు లేవు. షేక్‌పల్లి నుంచి రైతు ఫోన్ చేసి కంపెనీ సమస్యల గురించి సమాచారం ఇచ్చాడు. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

**- సాయిదివ్య, ఏఈ, పొల్యూషన్ బోర్డు**

# నేడు హరీశ్‌రావు రాక

- కురుమూర్తి క్షేత్రానికి సిద్దిపేట ఎమ్మెల్యే
- హాజరుకానున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు



మూసాపేట, నవంబర్ 19 : పేదల తిరుపతిగా పేరుగాంచిన కురుమూర్తి స్వామిని బుధవారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు దర్శించుకోనున్నారు. చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ సమీపంలోని ఏడుకొండలపై వెలిసిన అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యేందుకు ఆయన వస్తున్నారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే విజేయుడు, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు రానున్నారు. ఈ నేపథ్యంలో ఘన స్వాగతం పలికేందుకు దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో భూత్పూర్‌కు చేరుకుంటారు. అక్కడ ఆలతోపాటు ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా బయలుదేరుతారు. మూసాపేట మండలంలోని ఆదర్శ మహిళా సెంటర్ వద్ద మండలానికి చెందిన పార్టీశ్రేణులతో కలిసి అడ్డాకులకు చేరుకుంటారు. కొత్తకోట, మదనాపూర్ మీదుగా ఆలయానికి చేరుకుంటారు. స్వామికి పూజలు చేసిన అనంతరం నాయకులు, కార్యకర్తలతో మాట్లాడనున్నారు. అక్కడి నుంచి మూసాపేట మండలంలోని ఆదర్శ మహిళా సెంటర్ వద్ద మూసాపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు హాజరై వారితో పాటు కలిసి వెళ్తారు. అక్కడి నుంచి అడ్డాకులకు చేరుకుంటారు. అక్కడ మాజీ జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ కార్యకర్తలతో కలిసి కొత్త కోటకు.. అక్కడి నుంచి మదనాపూర్‌లో మండల నాయకులతో కలిసి భారీ ర్యాలీగా వెళ్లనున్నట్లు స్థానిక నాయకులు సూచించారు. అదేవిధంగా మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి వర్గీయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. పర్యటనను సక్సెస్ చేసే పనిలో నేతలు నిమగ్నమయ్యారు.

# తిరగబడిన రైతన్న

- ధాన్యం ఎందుకు కొనడం లేదని అధికారుల నిలదీత
- 17 శాతం తేమకే కొనుగోలు చేయాలని డిమాండ్
- అధికారులు హామీ ఇవ్వడంతో శాంతించిన హన్వాడ రైతులు

హన్వాడ, నవంబర్ 19 : కొనుగోలు ప్రారంభించి 15 రోజులైనా వడ్లను ఎందుకు కొనడం లేదని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం బ్యాంక్ ఆవరణలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తాసీల్దార్ కిష్టానాయక్‌తో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించేందుకు వచ్చారు. దీంతో అక్కడున్న రైతులు ఒక్కసారిగా వారిని చుట్టుముట్టారు. కొనుగోళ్లలో ఎందుకు జాప్యం వహిస్తున్నారని నిలదీశారు. వడ్ల తేమ శాతం 14 లేదా 16 శాతం వస్తేనే కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పడంతో ఒక్కసారిగా రైతులు తిరగబడ్డారు. కష్టపడి పండిస్తే ఇట్ల చేస్తారా..? అంతశాతం వస్తే తాము తీవ్రంగా నష్టపోతామని, 17 శాతం వరకే కొనుగోలు చేయాలి.. లేకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. దీంతో తాసీల్దార్ కిష్టానాయక్ స్పందించి జిల్లా అధికారులకు ఫోన్ చేసి విషయం తెలిపారు. రైతులు నష్టపోకుండా 17 శాతం ఉన్నవాటిని కూడా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో రైతులకు తూకం టోకెన్లు ఇవ్వడంతో శాంతించారు.



హన్వాడ రైతుల సమస్యను ఫోన్‌లో జిల్లా అధికారులకు విన్నవిస్తున్న తాసీల్దార్

# ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు

- సర్వే వివరాలు నమోదు చేయాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పాలమూరు, నవంబర్ 19 : సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దని, అన్ని వివరాలను నమోదు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. మంగళవారం మహబూబ్‌నగర్ రూరల్ మండలం రాంచంద్రాపురంలో కుటుంబ సర్వేలో భాగంగా వివరాలు నమోదు చేస్తున్న ఎన్యుమరేటర్లతో కలిసి సర్వేను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామంలోని ఒక్క ఇంటిని వదలకుండా కుటుంబ సభ్యుల వివరాలు, కులం, ఉపకులం, ఇతర వివరాలు తప్పకుండా నమోదు చేయాలన్నారు. ఈ కుల గణన సర్వేలో ప్రజలను ఆధార్‌కార్డు, పట్టాపాసుపుస్తకాలు, ప్రభుత్వ పథకాల వస్తున్నాయా? లేదా? అనే విషయాలను అడగాల్సిన అవసరం లేదని, ప్రజలకు లేనిపోని అపోహలను కల్పించవద్దని సర్వే వివరాల సేకరణ సిబ్బందికి తెలిపారు. సామాన్య ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రక్రియను సజావుగా కొనసాగించాలన్నారు. అలాగే హౌస్ నెంబర్లు లేని ఇండ్లకు సంఖ్యలు వేసి వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సమగ్ర కుల గణన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు ఖరారు చేసి ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# బాబ్బాబు.. కూసోండి..

- తుస్సుమన్న ప్రజాపాలన విజయోత్సవాలు
- పాలమూరులో కాంగ్రెస్ నేతలు, ప్రజల హాజరు అంతంతే..
- చేసేది లేక విద్యార్థులను తీసుకొచ్చిన వైనం
- ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే వెళ్లిపోయిన పలువురు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 19 : పాలమూరులో ప్రజాపాలన విజయోత్సవాలు అభాసుపాలయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదైన సందర్భంగా ఆయా జిల్లాల్లో ప్రభుత్వం తరఫున ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని శిల్పారామంలో అట్టహాసంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాంగ్రెస్ కార్యకర్తలు కానీ.. ప్రజలుకానీ ఎవరూ ఆశించినంతగా రాక పోవడంతో పరువు పోతుందని చివరి నిమిషంలో విద్యార్థులతో హాలును నింపారు. కలెక్టర్ విజయేందిర బోయి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కొందరు కాంగ్రెస్ లీడర్లు తప్పా ఇద్దరు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. ప్రజలకు ఏడాదిలో ఏం చేశామనేది దేవరకద్ర ఎమ్మెల్యే చెబుతుండడంతో ఈ సోదంతా మాకెందుకంటూ విద్యార్థులంతా వెళ్లిపోవడం ప్రారంభించారు. దీంతో స్టూడెంట్స్‌ను పట్టుకొచ్చి కూర్చోబెట్టడం కనిపించింది. అయినా బోర్ కొట్టిన విద్యార్థులు బయటకు వెళ్లి పోయారు. దీంతో అధికారులంతా బాబ్బాబు కూసోండి అంటూ.. బతిమిలాడుతూ కనిపించారు. అయినా విద్యార్థులంతా మధ్యలోనే వెళ్లి పోవడంతో కార్యక్రమం తుస్సుమన్నది.



సమావేశం నుంచి విద్యార్థులు వెళ్లిపోతుండడంతో ఖాళీగా కుర్చీలు



భూసేకరణ కోసం వచ్చిన అధికారులతో రైతుల వాగ్వాదం

# హైవేకు భూములిచ్చేది లేదు


- మాకు పరిహారం వద్దు.. భూములే కావాలి
- తాడూరులో అధికారులతో రైతుల వాగ్వాదం

తాడూరు, నవంబర్ 19 : 'జాతీయ రహదారికి భూమి ఇచ్చేది లేదని.. మా భూమిలో నుంచి రోడ్డు వేసేందుకు ఒప్పుకోమని.. మా భూములు మాకే కావాలి'.. అంటూ రైతులు కోరారు. కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి–167 నిర్మాణంలో భాగంగా తాడూరు మండల కేంద్రంలో ఉన్న పాత రోడ్డుపై కాకుండా బైపాస్ రోడ్డు కోసం భూసేకరణ కొనసాగుతున్నది. బైపాస్ సుమారు 3 కిలోమీటర్లకుపైగా వస్తుండడంతో ఇందుకోసం 60 నుంచి 70 ఎకరాల మేర రైతులు భూములు కోల్పోనున్నారు. ప్రస్తుతం పొలాల్లో పంటలు పండిస్తున్నామని, ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి హామీ లభించలేదని.. నష్ట పరిహారం మాకు వద్దంటూ.. భూమే కావాలంటూ మంగళవారం పలువురు రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు నచ్చజెప్పేందుకు యత్నించినా వారు వినకపోవడంతో చేసేది లేక అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏదేమైనా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా తమ భూములు రోడ్డుకోసం ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. అవసరమైతే ప్రాణ త్యాగాలకైనా సిద్ధమని హెచ్చరించారు.

# జడ్చర్ల అభివృద్ధికి కృషి చేయాలి

- మాజీ మంత్రి లక్ష్మారెడ్డి
- కొత్త చైర్‌పర్సన్‌కు అభినందనలు

జడ్చర్ల, నవంబర్ 19 : జడ్చర్ల మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి సూచించారు. ఇందుకోసం అందరూ సమిష్టిగా సహకారం అందించాలని కోరారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని 14వ వార్డు కౌన్సిలర్ కోనేటి పుష్పలత చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నేపథ్యంలో మంగళవారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు హైదరాబాద్‌లో లక్ష్మారెడ్డిని కలిశారు. ఆయన్ను సన్మానించి పుష్పగుచ్ఛం అందించిన అనంతరం నూతనంగా ఎన్నికైన పుష్పలతకు లక్ష్మారెడ్డి శాలువా కప్పి అభినందించారు. బీఆర్ఎస్ పార్టీ సూచించిన చైర్‌పర్సన్ అభ్యర్థికి మద్దతు పలికి ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వారి వెంట కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, ఉమా శంకర్‌గౌడ్, ఉమాదేవి, జ్యోతి కృష్ణారెడ్డి, మహేశ్, శశికిరణ్, రఘురాం, దేవా, నంద కిశోర్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు మురళి, కొండల్, నర్సింహులు, రామ్మోహన్, కృష్ణారెడ్డి, వెంకటేశ్, నర్సింహులు యాదవ్ ఉన్నారు.



హైదరాబాద్‌లో మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని కలిసిన జడ్చర్ల మున్సిపల్ నూతన చైర్‌పర్సన్ పుష్పలత, కౌన్సిలర్లు

# నోటీస్‌కు భయపడి..

- మక్తల్‌లో గుండెపోటుతో చిరువ్యాపారి మృతి
- కుళ్లిన కూరగాయలు రోడ్డుపై వేసిందని రూ.200 ఫైన్ వేసిన మున్సిపల్ సిబ్బంది
- మరోసారైతే రూ.10 వేలు కట్టాలనడంతో కలతచెంది వృద్ధురాలి హార్ట్‌అటాక్

మక్తల్, నవంబర్ 19 : మున్సిపాలిటీ నుంచి అందిన నోటీస్‌కు భయపడి చిరువ్యాపారి ప్రాణాలు వదిలిన సంఘటన మక్తల్‌లో చోటు చేసుకున్నది. వివరాలిలా..

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలోని ప్రధాన రహదారి పక్కనే బాలమ్మ అనే వృద్ధురాలు కొన్నేండ్ల నుంచి కూరగాయలు విక్రయిస్తున్నది. అయితే రోడ్డుపై చెత్తతో పాటు కుళ్లిన కూరగాయలు వేస్తున్నావంటూ కమిషనర్ భోగేశ్వర్, కార్యాలయ సహాయకుడు మంగళవారం ఉదయం ఆమెకు నోటీసులిచ్చారు. రూ.200 జరిమానా చెల్లించాలని.. మరోసారి రోడ్డుపై అలాగే కుళ్లిన కూరగాయలు వేస్తే రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు జరిమానా వేస్తామని హెచ్చరించారు. అధికారి చెప్పిన మాటలకు కలత చెందిన వృద్ధురాలు విక్రయ కేంద్రం వద్దే కిందపడిపోయింది. స్థానికులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లగా.. గుండెపోటుతో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. పుర కమిషనర్ భోగేశ్వరను వివరణ కోరగా.. బాలమ్మ కూరగాయల వ్యాపారం చేస్తూ రోడ్డుపై మురిగిపోయిన కూరగాయలతోపాటు చెత్త వేస్తుండడంతో జరిమానా వేసి రసీదును అందించింది నిజమే అన్నారు. అంతేగానీ ఆమెను ఎలాంటి భయభ్రాంతులకు గురిచేయలేదన్నారు.



రోడ్డుపై చెత్త వేసిందని ఫైన్ వేసి రసీదును అందిస్తున్న అధికారులు

# క్రీడలతోపాటు చదువులో రాణించాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్, నవంబర్ 19 : ప్రతి విద్యార్థి క్రీడలతోపాటు చదువులోనూ రాణిస్తేనే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకునే అవకాశం ఉన్నదని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కర్ని జెడ్పీహెచ్ఎస్‌లో తెలంగాణ రాష్ట్ర ఖోఖో జట్టు క్రీడాకారులకు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి క్రీడాకారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ జాతీయ స్థాయిలో త్వరలో ఖోఖో ఆడబోయే వారు శిక్షణలో అద్భుతమైన మెలకువలు తెలుసుకొని ప్రతిభ చాటాలని సూచించారు. రాష్ట్ర ప్రతిష్ఠను చరిత్రపుటల్లో ఎక్కేలా రాణించాలన్నారు. క్రీడల్లో సత్తా చాటితే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందే అవకాశాలు ఉన్నాయన్నారు. జాతీయ స్థాయి పోటీలకు శిక్షణ ఇస్తున్న పీడీ రూపను ఆయన అభినందించారు. ఈనెల 25 నుంచి 29వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులకు ఎల్లప్పుడూ తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గోపాల్, జీహెచ్ఎం వెంకటయ్యగౌడ్, స్థానిక యువకుడు గంగాధర్ తోపాటు క్రీడాకారులు పాల్గొన్నారు.



జాతీయస్థాయి ఖోఖో జట్టు శిక్షణ క్రీడాకారులతో మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి